# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 133 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | గురువారం, 09 ఏప్రిల్ 2026 | పేజీలు : 4




పసికందు కిడ్నాప్

## కలకలం

- ఎంసీహెచ్ నుంచి ఎత్తుకెళ్లే యత్నం
- మహిళను అదుపులోకి తీసుకున్న పోలీసులు

3 లో




2 లో

అవగాహనతోనే

## ఎయిడ్స్ నివారణ

- జనగామ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



ఖర్చుగా కాదు.. భాగస్వామ్యంగా

## చూడండి..

- సీఎస్ఆర్ నిధులపై కంపెనీ ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

**హైదరాబాద్, మన చౌరాస్తా :** సమాజాభివృద్ధికి చేసేది ఖర్చుగా కాకుండా భాగస్వామ్యంగా చూడాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. సీఎసఆర్ నిధులకు సంబంధించి వివిధ కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కంపెనీలు సీఎసఆర్‌కు చేస్తున్న వ్యయం వందకు వంద శాతం సత్ఫలితాలు ఇచ్చేలా ఉండాలన్నారు. తమ ప్రభుత్వం విద్యా, వైద్యం, జల వనరుల సంరక్షణకు ప్రాధాన్యం ఇస్తుందని తెలియజేశారు. కంపెనీలు వీటితో పాటు తమకు ఇష్టమైన ఏ రంగాన్నైనా ఎంచుకొని సీఎసఆర్ నిధులు వినియోగించాలని సూచించారు. ప్రభుత్వంతో పాటు కంపెనీలు కలిపి చేసే వ్యయంతో తెలంగాణ విద్యార్థులను ప్రపంచ స్థాయి నైపుణ్యం ఉన్న వారిగా తీర్చిదిద్ది భవిష్యత్ అవకాశాలను వారు అందిపుచ్చుకునేలా తయారు చేయగలమని సీఎం అన్నారు. విద్యపై పెట్టే వ్యయాన్ని తాము భవిష్యత్ తరాలపై పెట్టే పెట్టుబడిగా భావిస్తున్నామని సీఎం తెలిపారు. రాష్ట్రంలోని విద్యార్థుల సంఖ్యలో హైదరాబాద్ నగరంలోనే 44 శాతం ఉన్నారని.. వారికి నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత మన అందరిపైన ఉందన్నారు. కంపెనీలు స్థానికంగా ఉన్న అన్ని మౌలిక వసతులను వినియోగించు కుంటున్నందున తమ సీఎసఆర్ నిధుల్లో ఎక్కువ మొత్తాన్ని అదే ప్రాంత అభివృద్ధికి కేటాయించాలన్నారు. సీఎసఆర్ నిధుల వినియోగంలో ఇప్పటి వరకు సరైన విధానం లేనందున తాము ఒక ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని ఇందుకు నియమించామని సీఎం తెలిపారు. కంపెనీల ప్రతినిధులు ఆయనతో సమన్వయం చేసుకొని తమకు ఆసక్తి ఉన్న విద్యా, వైద్యం, జల వనరులు, నైపుణ్య శిక్షణ, వారసత్వ కట్టడాల పరిరక్షణ, అడవుల సంరక్షణ ఇలా దేనికైనా సీఎసఆర్ నిధులు వినియోగించవచ్చని సీఎం తెలిపారు. ఇప్పటికే రహేజా గ్రూప్ రూ.50 కోట్లు, రాంకీ గ్రూప్ రూ.50 కోట్లు, యశోద ఫౌండేషన్ రూ.10 కోట్లు విద్యాభివృద్ధికి కేటాయించేందుకు ముందుకు వచ్చాయని.. వారికి సీఎం అభినందనలు తెలిపారు. కంపెనీల ప్రతినిధులు స్పందిస్తూ సీఎసఆర్ నిధుల విషయంలో ఇప్పటి వరకు ఇలా ఎవరూ తమను సంప్రదించలేదని తెలిపారు. ఈ విషయంలో చొరవ తీసుకున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అభినందనలు తెలిపారు. పాఠశాల విద్యా, ఆసుపత్రులు, వారసత్వ కట్టడాల పరిరక్షణకు వారు ఆసక్తి చూపారు.. సమావేశంలో రహేజా ఫౌండేషన్ నుంచి శ్రావణ్ కుమార్, రాంకీ ఫౌండేషన్ నుంచి దాక్షయణి ఆళ్ల, యశోద ఆసుపత్రి నుంచి డాక్టర్ గోరుకంటి సురేందర్ రావు, గోరుకంటి ఫల్గుణ్ రావు, మేఘా నుంచి సుధా రెడ్డి, అపోలో ఆసుపత్రి నుంచి అపర్ణా రెడ్డి, కామినేని భాస్కర్ రెడ్డి, ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ నుంచి శేఖర్ రెడ్డి, పగిడిపాటి దేవయ్య, రుద్రమదేవి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, విద్యా శాఖ ప్రత్యేక కార్యదర్శి వెంకటేష్ ధోత్రే, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు.




# అవగాహనతోనే ఎయిడ్స్ నివారణ సాధ్యం

**కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**




**జనగామ, మన చౌరాస్తా :** ఎయిడ్స్‌పై అవగాహనతోనే నివారణ సాధ్యం అని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య వారోత్సవాల కింద నాలుగో రోజు ఎయిడ్స్ పై అవగాహన, నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం రెడ్ రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరై ఈ రెడ్ రన్ వాకథాన్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ నేపథ్యంలో స్థానిక బస్టాండ్ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు ఎయిడ్స్ నివారణపై తెలంగాణ సాంస్కృతిక కళాకారులచే కళాజాత ద్వారా పాటలు ఆలపించి, అవగాహన కల్పిస్తూ ఈ రెడ్ రన్ వాకథాన్ ర్యాలీని చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎయిడ్స్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఎయిడ్స్ ఒక నివారించలేని (incurable) వ్యాధి అయినప్పటికీ, సరైన జాగ్రత్తలు తీసుకుంటే దీనిని అరికట్టవచ్చని తెలిపారు. అసురక్షిత లైంగిక సంబంధాలు, సంక్రమిత రక్తం (Infected Blood Transfusion), వాడిన సిరంజీల ద్వారా ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుందని వివరించారు. అందువల్ల ప్రతి ఒక్కరూ సురక్షిత పద్ధతులను పాటిస్తూ, జాగ్రత్తగా ఉండాలన్నారు. జిల్లాలో కూడా (2040) ఎయిడ్స్ కేసులు నమోదయ్యాయని, ప్రస్తుతం (1342) మంది బాధితులకు జిల్లా కేంద్రంలోని జీజీహెచ్ ఆసుపత్రిలో గల ఏఆర్టీ కేంద్రంలో అవసరమైన చికిత్స అందిస్తున్నామన్నారు. అలాగే జనగామ, ఘనపూర్ (స్టేషన్) లలో ఐసీటీసీ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ మేరకు బాధితులు భయపడకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందాలని సూచించారు. అదే విధంగా పల్లెల్లో, పట్టణాల్లో ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించేందుకు కళాజాతలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రజలు ఈ కార్యక్రమాలలో పాల్గొని, వ్యాధి గురించి సరైన సమాచారం తెలుసుకోవాలని కోరారు. ఎయిడ్స్‌పై అవగాహన పెంపొందించడం ద్వారా సమాజాన్ని ఆరోగ్యవంతంగా ఉంచుకోవచ్చని కలెక్టర్ స్పష్టం చేశారు. ర్యాలీలో వైద్య అధికారులు, ఏఎన్ఎంలు, ఆశాలు, సిబ్బంది, వైద్య విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని, చేతిలో ప్లకార్డులు పట్టుకొని "ఎయిడ్స్ నివారణ" నినాదాలతో ప్రజలకు సందేశం అందించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ మల్లికార్జున రావు, డా. అశోక్, ప్రోగ్రామ్ అధికారి (ఎన్టీఈపీ), డా. కమల్ హసన్, డా. శ్రీతేజ, ఏఆర్టీ సెంటర్ వైద్యాధికారులు, ఇతర సంబంధిత వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశాలు, వైద్య విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు, ఆరోగ్య శాఖ సిబ్బంది, ఎన్జీఓలు, ట్రాన్స్‌జెండర్లు తదితరులు పాల్గొన్నారు.








# ముల్కనూర్ పీఎస్‌ను సందర్శించిన సీపీ

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా ముల్కనూర్ పోలీస్ స్టేషన్‌ను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి, స్టేషన్ పనితీరును అధికారుల నుంచి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. గ్రామీణ ప్రాంత ప్రజల్లో సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించాలని, డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే "Arrive Alive" కార్యక్రమం ద్వారా ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. స్టేషన్ రికార్డులను పరిశీలించిన కమిషనర్ గ్రామాల హిస్టరీ షీట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని, అధికారులు గ్రామాల పర్యటనలను తరచుగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, ఎల్కతుర్తి సిఐ పులి రమేష్, ఎస్.ఐ రాజు పాల్గొన్నారు.



# జయంతి ఉత్సవాలను సక్సెస్ చేయండి

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లా కేంద్రంలో ఈ నెల 11వ తేదీ నుండి 14వ తేదీ వరకు నిర్వహించనున్న మహనీయుల జయంతి ఉత్సవాలను అత్యంత వైభవంగా, విజయవంతంగా నిర్వహించాలని జిల్లా ఉత్సవ కమిటీ అధ్యక్షులు గద్దల కిషోర్ కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని విజయ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఉత్సవాలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజ మార్పు కోసం కృషి చేసిన మహనీయుల ఆశయాలను స్మరించుకుంటూ ఈ కార్యక్రమాలను రూపొందించినట్లు తెలిపారు.

**ఉత్సవాల పూర్తి షెడ్యూల్..**

**ఏప్రిల్ 11:** మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు.

**ఏప్రిల్ 12 :** పట్టణ వ్యాప్తంగా భారీ ఎత్తున బైక్ ర్యాలీ.

**ఏప్రిల్ 13 :** సాయంత్రం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే 'అంబేద్కర్ జ్ఞాన యాత్ర'.

**ఏప్రిల్ 14 :** ప్రభుత్వం, ఉత్సవ కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి ఉత్సవ సభ.

"అంబేద్కర్ జ్ఞాన యాత్రకు అంబేద్కర్‌వాదులు, మేధావులు మరియు అన్ని వర్గాల ప్రజలు భారీ సంఖ్యలో తరలిరావాలి. కులమతాలకు అతీతంగా, ఐక్యత స్ఫూర్తితో ఈ ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి." గద్దల కిషోర్, జిల్లా ఉత్సవ కమిటీ అధ్యక్షులు.ఈ సమావేశంలో జిల్లా ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పాల డైరీ సంఘ భవనానికి భూమి పూజ

**హనుమకొండ, మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా వంగర గ్రామంలో మహిళా పాల డైరీ-2 సంఘానికి సొంత భవన నిర్మాణానికి బుధవారం భూమి పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ గజ్జల సృజన రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ గజ్జల సృజన రమేష్ మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి మహిళా పాల డైరీ సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా బలపడేందుకు ఇలాంటి సంఘాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. మహిళా పాల డైరీ సంఘానికి సొంత భవనం నిర్మాణం గ్రామ అభివృద్ధికి ఒక మంచి అడుగుగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వల్లాల రమేష్, వార్డ్ సభ్యులు మారం సతీష్, గజ్జల రమేష్, సూపర్వైజర్ వసంత, మహిళా పాల డైరీ సంఘం కార్యవర్గ సభ్యులు కాల్వ సునీత, గౌరవేణి భాగ్య, ఆషాడపు లక్ష్మి, నీలం శోభ, రాజమ్మ, బల్ల లావణ్య, బల్ల శ్రీదేవి, ఘనకులు రవీందర్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే గ్రామస్తులు కాల్వ సంపత్, వెంగళ నారాయణ, ఏనుక శ్రీనివాస్, నల్లగోని రమేష్, నీలం బిక్షపతి, మర్రి రవి, మర్రి దొడ్డయ్య తదితరులు హాజరయ్యారు.



## రఘునాథపల్లిలో వరుస దొంగతనాలు

**రఘునాథపల్లి, మన చౌరాస్తా :** రఘునాథపల్లి మండల కేంద్రంలోని హైదరాబాద్ వరంగల్ జాతీయ రహదారి పక్కన ఉన్న ఆర్వీఎస్ కాంప్లెక్స్ సమీపంలోని, మానుపాటి సోమలక్ష్మి నివాసంలో బుధవారం అర్ధరాత్రి దొంగలు పడ్డారు. బాధిత కుటుంబ సభ్యులు బంధువుల ఇంటికి వెళ్లడంతో, ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని ఆసరాగా చేసుకున్న దుండగులు తలుపులు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువాలోని విలువైన వస్తువులతో పాటు వంట గదిలోని గ్యాస్ సిలిండర్‌ను కూడా ఎత్తుకెళ్లారు. సమాచారం అందుకున్న రఘునాథపల్లి సబ్ ఇన్‌స్పెక్టర్ నరేష్ యాదవ్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.గత వారం రోజుల్లోనే ఇది రెండో ఘటన కావడం గమనార్హం. ఇదే మండల కేంద్రంలోని సెల్ టవర్ వద్ద కూడా దొంగలు పడి ఏసీ కంప్రెషన్ ఎత్తుకెళ్లారు. వరుసగా జరుగుతున్న ఈ చోరీల పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు రాత్రి పూట గస్తీని పెంచి, హైవేపై నిరుపయోగంగా ఉన్న సీసీ కెమెరాలు పొనొద్ధరించి, దొంగలను త్వరగా పట్టుకోవాలని కోరుతున్నారు.

# మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కు పరామర్శ



**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జీవన్ రెడ్డి సతీమణి కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించగా బుధవారం చేర్యాల మార్కెట్ కమిటీ చైర్మెన్ నల్లనాగుల శ్వేత వెంకన్న మార్కెట్ కమిటీ డైరెక్టర్లతో కలిసి జీవన్ రెడ్డి నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. జీవన్ రెడ్డి సతిమణి మృతి చాలా బాధాకరమని వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుంది అని ధైర్యం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ రవి, డైరెక్టర్లు లక్ష్మీనారాయణ, అర్జుల పోషి రెడ్డి, బండారి కనకయ్య, బైరగోని భాను ప్రకాష్, సింగపాక కుమార్, వంగ కృష్ణ రెడ్డి, మాజీ డైరెక్టర్ ఇర్రి రాంరెడ్డి లు పాల్గొన్నారు.





# జనగామలో పసికందు కిడ్నాప్ కలకలం

- ఎంసీహెచ్ పిల్ల వార్డు నుంచి ఎత్తుకెళ్లే ప్రయత్నం
- మహిళను అదుపులోకి తీసుకున్న పోలీసులు

**జనగామ, మన చౌరాస్తా :** జనగామలోని ఎంసీహెచ్ ఆసుపత్రిలో పసికందును కిడ్నాప్ చేయడానికి ప్రయత్నించిన ఘటన కలకలం రేపింది. సలక్‌పూర్‌కు చెందిన కీర్తనకు జన్మించిన బాబును పిడియాట్రిక్ వార్డులో చికిత్స అందిస్తున్న సమయంలో తాళ్లపల్లి జ్యోతి తన బాబే అంటూ లోనికి వెళ్లి డైపర్ మార్చే పేరుతో బిడ్డను ఎరుపు తువాలుతో చుట్టుకొని బయటకు తీసుకెళ్లింది. అనుమానంతో సెక్యూరిటీ సిబ్బంది, బంధువులు వెంటపడడంతో మహిళను పట్టుకుని బిడ్డను తిరిగి ఆసుపత్రికి తీసుకువచ్చారు. తరువాత బాబుకు సంబంధించిన కుటుంబ సభ్యులు ఆగ్రహంతో మహిళపై దాడి చేయగా అడ్డుకోవడానికి ప్రయత్నించిన సెక్యూరిటీ గార్డ్ బానోత్ భాస్కర్‌కు గాయం అయ్యింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకుని మహిళను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.








# కలాల కవాతు పుస్తకావిష్కరణ

హైదరాబాద్, మన చౌరాస్తా : ప్రజాకవి గద్దర్ ఆలోచనలు, పోరాట స్ఫూర్తి తరతరాలకు మార్గదర్శకంగా నిలవాలని శాంతా సిన్హా అన్నారు. ఆయన జీవితం పూర్తిగా ప్రజల కోసం అంకితమైందని పేర్కొన్నారు. హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ సామాజికవేత్త సామ మల్లారెడ్డి రచించిన 'కలాల కవాతు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన శాంతా సిన్హా, గద్దర్ జీవితం మొత్తం సామాజిక మార్పు కోసం సాగిందని, ఆయన పాటలు ప్రజల్లో చైతన్యాన్ని రగిలించాయని తెలిపారు. 1997 ఏప్రిల్ 6న గద్దర్‌పై జరిగిన గద్దర్‌పై కాల్పుల ఘటన 1997 ను పురస్కరించుకుని "పాటపై తూటా... ప్రశ్నించే గొంతులు... సాధించిన విజయాలు" అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొ. కాశీం మాట్లాడుతూ గద్దర్‌పై కాల్పులు ఎవరు జరిపారో ప్రజలకు తెలుసని, మరణాన్నికూడా లెక్కచేయకుండా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చిన గొప్ప పోరాట యోధుడని కొనియాడారు. కోయి కోటేశ్వరరావు మాట్లాడుతూ, రాజ్య హింస ఎంత తీవ్రమైనా ప్రజా చైతన్యం దానికంటే బలంగా ఉంటుందని అన్నారు. గద్దర్ ఒక తుఫానుగా పుట్టి సమాజంలో మార్పు కోసం తన పాటను ఆయుధంగా ఉపయోగించారని తెలిపారు. ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లినప్పుడే నిజమైన నివాళి అవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కె. నారాయణ, కాకి మాధవరావు, కోదండరాం తదితరులు మాట్లాడుతూ గద్దర్ రాజ్యహింసకు వ్యతిరేకంగా పాట, ఆటల ద్వారా పోరాటం చేసిన గొప్ప వ్యక్తి అని పేర్కొన్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. జి. సూర్యం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్వెస్, ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, ప్రజాకవి సంజీవ్, జర్నలిస్టు తులసి చంద్, సామ మల్లారెడ్డి, సుల్తాన్ యాదగిరి, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.



## నూతన వధూవరులకు ఎర్రబెల్లి ఆశీర్వాదం

**పాలకుర్తి, మన చౌరాస్తా:** పాలకుర్తి మండల బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గజ్జి చంద్రమౌళి కుమారుడు గజ్జి సంతోష్ వివాహం క్లాసిక్ గార్డెన్స్ జరిగింది. ఈ వివాహ మహోత్సవానికి హాజరై నూతన వధూవరులను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆశీర్వదించారు. పాలకుర్తి మండల బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు యూత్ సోషల్ మీడియా నాయకులు పాల్గొన్నారు.



# డాక్టర్ ప్రవీణ్‌కు ఉత్తమ వైద్య సేవా పురస్కారం

హైదరాబాద్, మన చౌరాస్తా : ఎర్రగడ్డలోని ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి పంచకర్మ నిపుణులు, ఆయుర్వేద మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్‌కు తెలంగాణ ప్రభుత్వ వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆయుష్ విభాగంలో రాష్ట్ర స్థాయి "ఉత్తమ వైద్య సేవా పురస్కారం" అందించింది. తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తోన్న 99రోజుల "ప్రజా పాలనప్రగతి నివేదిక" కార్యక్రమంలో భాగంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహా, ఆరోగ్య కార్యదర్శి క్రిస్టినా జెడ్ చంగ్తు చేతుల మీదుగా ఆయన ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం అందుకున్నారు. సాధారణంగా వైద్యులు రోగిని పరిశీలించి మందులు ఇచ్చి పంపిస్తారు. కానీ, డాక్టర్ ప్రవీణ్ కుమార్ రోగులతో మాట్లాడతారు. వారి బాధలు వింటారు. వారి జీవన శైలిని అర్థం చేసుకుంటారు. ఆ మాటలతోనే, ఆ శ్రద్ధలోనే సగం వ్యాధి తగ్గిపోతుందని రోగులు చెబుతుంటారు. ఆయుర్వేదపు పురాతన చికిత్సా పద్ధతి అయిన పంచకర్మను ఆధునిక అవసరాలకు తగినట్టుగా సమ్మిళితం చేస్తూ, ఆయన వందలాది రోగులకు కొత్త జీవితాన్ని అందించారు. ఇంకా అందిస్తూనే ఉన్నారు. ఆయన వద్ద చికిత్స పొందిన రోగులు.. డాక్టర్ ప్రవీణ్ కుమార్ ను ఆయుర్వేద వైద్య వ్యవస్థలో కలికితురాయిగా అభివర్ణిస్తారు. డాక్టర్ ప్రవీణ్ కుమార్ ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి అనుబంధ వైద్య కళాశాలలో ప్రొఫెసర్ గా కూడా వందలమంది వర్ధమాన వైద్యులను తయారు చేయడంలో తన పాత్ర పోషిస్తున్నారు. ఆయుర్వేదం కేవలం మూలికల వైద్యం మాత్రమే కాదని, అది మనిషిని సమగ్రంగా చూసే విజ్ఞానం అని, పంచకర్మ చికిత్స ద్వారా శరీరం, మనసు రెండూ స్వస్థత పొందుతాయని, అదే మన ప్రాచీన వైద్య వారసత్వం అని డాక్టర్ ప్రవీణ్ కుమార్ చెబుతారు. ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందని డాక్టర్ ప్రవీణ్ కుమార్ అన్నారు.

# లైన్ ఇన్‌స్పెక్టర్‌గా నీలం సత్యనారాయణ

**లింగాలఘనపురం, మన చౌరాస్తా :** మనం ఎక్కడ పుట్టాం అనేది ముఖ్యం కాదు.. ఎంత ఎత్తుకు ఎదిగాం అన్నదే ముఖ్యం అని నిరూపించారు నీలం సత్యనారాయణ. ఒక సామాన్య నిరుపేద కుటుంబంలో జన్మించి, రెక్కల కష్టాన్ని నమ్ముకుని, విద్యుత్ శాఖలో అట్టడుగు స్థాయి నుండి ఉన్నత స్థాయి బాధ్యతల వరకు ఆయన సాగించిన ప్రయాణం నేటి యువతకు ఒక గొప్ప పాఠం. జనగామ జిల్లా లింగాలఘనపురంలో ఒక నిరుపేద కుటుంబంలో పుట్టిన సత్యనారాయణ చిన్నతనం నుండే అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నప్పటికీ, ఏనాడూ తన లక్ష్యం పట్ల వెనకడుగు వేయలేదు. చదువుకుంటూనే కుటుంబానికి అండగా నిలిచిన ఆయన, కష్టపడే తత్వాన్నే తన ఆయుధంగా మార్చుకున్నారు.

**హెల్పర్ టు లైన్ ఇన్‌స్పెక్టర్..**


విద్యుత్ శాఖలో హెల్పర్ గా తన వృత్తి జీవితాన్ని ప్రారంభించిన సత్యనారాయణ ఎండనక, వాననక క్షేత్రస్థాయిలో అహర్నిశలు శ్రమించారు. ప్రమాదకరమైన విద్యుత్ తీగలతో పనిచేస్తూనే, తన విధుల్లో ఎంతో నిబద్ధతను



చాటుకున్నారు. ఆయన కష్టానికి గుర్తింపుగా క్రమక్రమంగా పదోన్నతులు పొందుతూ.. నేడు తన సొంత జిల్లా అయిన జనగామలో లైన్ ఇన్‌స్పెక్టర్ గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖాధికారులు, తోటి ఉద్యోగులు ఆయనను అభినందనలతో ముంచెత్తారు.

# అల్లు అర్జున్ మూవీ పేరు రాకా !

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు అదిరిపోయే గిఫ్ట్ అందింది. తమిళ స్టార్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో బన్నీ చేయబోతున్న భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ టైటిల్‌ను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రానికి 'రాకా' అనే పవర్ ఫుల్ టైటిల్‌ను ఖరారు చేస్తూ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. విడుదలైన పోస్టర్‌లో అల్లు అర్జున్ మునుపెన్నడూ చూడని విభిన్నమైన అవతారంలో కనిపిస్తున్నారు. గుండుతో, కళ్లకు కాటుక పెట్టుకుని, ఒంటిపై వింత ఆకృతులతో ఉన్న ఈ లుక్ చూస్తుంటే ఆయన ఏదో 'వేర్`బీస్ట్' (జంతువుగా మారే మనిషి) తరహా పాత్రలో నటిస్తున్నట్లు తెలుస్తోంది. 'జవాన' వంటి సెన్సేషనల్ హిట్ తర్వాత అట్లీ తెరకెక్కిస్తున్న చిత్రం కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇందులో బాలీవుడ్ స్టార్ నటి దీపికా పదుకొణె హీరోయిన్‌గా నటిస్తుండటం విశేషం. ఆమె ఈ చిత్రంలో ఒక వీరనారి పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం సుమారు 800 కోట్ల రూపాయల భారీ బడ్జెట్‌తో, అత్యాధునిక భారీ హంగులతో రూపొందుతోంది. హాలీవుడ్ టెక్నీషియన్లు కూడా ఈ ప్రాజెక్ట్ కోసం పని చేస్తున్నారు. ఈ చిత్రాన్ని తెలుగు, హిందీ, తమిళం సహా 7 భాషల్లో 2027 వేసవిలో విడుదల చేసేందుకు చిత్రబృందం ప్లాన్ చేస్తోంది. 'విజన్ బియాండ్ లిమిట్స్' హద్దులు లేని ఊహ అనే ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.




Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**